క్లుప్తంగా

మీ సేవ కేంద్రాలు మంజూరు

ఇల్లెందురూరల్: చల్లసముద్రం, సుదిమళ్ల గ్రామపంచాయతీలకు మీ సేవ కేంద్రాలు మంజూరైనట్లు సెర్ప్ ఏపీఎం దుర్గారావు తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 36 గ్రామపంచాయతీలకు మీ సేవ కేంద్రాలు మంజూరు కాగా అందులో మండలం నుంచి సుదిమళ్ల గ్రామపంచాయతీకి, చల్లసముద్రం గ్రామపంచాయతీ వేములవాడకు అనుమతి లభించిందని తెలిపారు. ఆయా గ్రామపంచాయతీలలో నిబంధనలకు లోబడి అర్హులైన పొదుపు సంఘాలకు చెందిన మహిళల నుంచి ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించామని చెప్పారు. అర్హులను ఎంపిక చేసి మీ సేవ కేంద్రాల నిర్వహణను అప్పగిస్తారని వివరించారు.

వైద్యశిబిరం

పాల్వంచ: బంజర గ్రామ పంచాయతీ చిరుతానిపాడు గొత్తికోయ ఆవాస ప్రాంతంలో డివిజనల్ పంచాయతీ అధికారి రమణారావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించారు. గ్రామంలో బ్లీచింగ్, యాంటీ లార్వా స్ప్రే చేయించారు. అనంతరం ప్రజలకు మలేరియా పరీక్షలు నిర్వహించారు. మాట్లాడుతూ... సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. మండల పంచాయతీ అధికారి బొగ్గ నారాయణ, కార్యదర్శి నరేష్, ఆశా వర్కర్ యశోద, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బోనాల వేడుక


బోనాలతో వస్తున్న భక్తులు

ఇల్లెందు: ఇల్లెందు ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ఆషాఢ – శ్రావణ మాసం సందర్భంగా పట్టణంలోని కొత్త కాలనీకి చెందిన ప్రజలు పెద్దమ్మతల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గురువారం కొత్తకాలనీకి చెందిన శివశక్తి దండు సారయ్య(సారిక) ఆధ్వర్యంలో వివిధ వేషధారణలతో అలంకరించిన బోనాలతో ఊరేగింపు నిర్వహించారు.

28న 'రాయల' సంతాపసభ

కొత్తగూడెంరూరల్: జూలై 28 ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ సంతాపసభ నిర్వహిస్తున్నామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి గుగులోతు రామచందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విప్లవాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోండి..

పాల్వంచ: విద్యార్థినుల పట్ల అసభ్యపదజాలంతో, చులకనగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయురాలు లావణ్యపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల సుజన్‌రాజ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఎంఈఓ శ్రీరామ్మూర్తిని కలిసి వినతిపత్రం అందించారు. కమల్, కల్యాణ్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ ప్రమాదంలో గాయపడిన మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికుడు దుర్గాప్రసాద్‌కు మెరుగైన వైద్యం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా గురువారం ఒక ప్రకటనలో కోరారు. విధి నిర్వహణలో ప్రమాదం జరగడం దురదృష్టకరమని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కవలల జననం

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా ఆస్పత్రిలో ఓ గర్భిణి కవలలకు జన్మనిచ్చింది. పట్టణంలోని కాకతీయ నగర్‌కు చెందిన దమ్మాలపాటి సుజాత గురువారం ప్రసూతి కోసం ఆస్పత్రికి రాగా డాక్టర్ సింధు ఆధ్వర్యంలో శస్త్రచికిత్స చేశారు. ఒక పాప, బాబు జన్మించారని ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు.

నిలిచిన రోడ్ల నిర్మాణ పనులు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



లక్ష్మీపురం ఆర్లగండి మధ్యలో నిలిచిన రోడ్డు నిర్మాణం (ఇన్‌సెట్) శిలాఫలకం

కొత్తగూడెంరూరల్: మారుమూల గిరిజన గ్రామాలకు ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. దీనివల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో పల్లె రహదారులు అధ్వానంగా మారాయి. గిరిజన పల్లెలకు సరైన రోడ్లు లేవు. పల్లె ప్రజలు బురదమయంగా మారిన రోడ్లపై రాకపోకలు సాగించటం కష్టంగా ఉంది. లక్ష్మీదేవిపల్లి మండలం లక్ష్మీపురం – ఆర్లగండి మధ్య ఐదేళ్ల క్రితం రూ.70 లక్షలతో బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ రహదారి చదును చేసి కంకర పరిచే సమయంలో బిల్లులు రాకపోడటం వల్ల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఆ రోడ్డుపై రెండు గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగించటం కష్టంగా మారింది. వ్యవసాయ సీజనల్ అక్కడి రైతులు సరైన రహదారి సౌకర్యం లేక బురదలోనే వ్యవసాయ పనిముట్లు తీసుకెళ్లడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ అందరూ వ్యవసాయం మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తారు. అదేవిధంగా లక్ష్మీదేవిపల్లి మండలంలోని ప్రశాంతినగర్ నుంచి మాదిగప్రోలు మధ్య నాలుగేళ్ల క్రితం రూ.70 లక్షలతో చేపట్టిన రహదారి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర పరిచారు. ఆ తరువాత కొద్దిగా పనులు సాగినప్పటికీ, నిధుల లేమి కారణంగా సంబంధిత కాంట్రాక్టరు చేతులెత్తేశారు. దీంతో ఆ ప్రాంతానికి వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షాకాలం అయితే బురదతో మాదిగప్రోలు ప్రాంతానికి రాకపోకలు కొనసాగించటానికి స్థానికులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. అయినా పట్టించుకునే నాథులే కరువయ్యారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగా రెండు రోడ్లు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే... అన్నట్లు పనులు నిలిచిపోయాయి. ఈ విషయంలో స్థానిక సర్పంచ్‌లు ఐటీడీఏ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకునే వారే లేరు. ప్రశాంతినగర్ నుంచి మాదిగప్రోలు రహదారి గత వర్షాకాలం రహదారి కొట్టుకపోయింది. దీంతో మాదిగప్రోలు వాసులకు రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే అప్పటి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రెండు రహదారులు నిర్మాణం పూర్తి చేయాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం


కేక్ కట్ చేస్తున్న రామారావు

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగ, కార్మికుల సంక్షేమమే తమ యూనియన్ లక్ష్యం అని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్142) రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రామారావు అన్నారు. గురువారం స్థానిక యూనియన్ కార్యాలయంలో యూనియన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. తొలుత కేటీపీఎస్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీనివాసాచారి, సత్యరాజ్‌స్టీవెన్, వెంపటి వెంకటేశ్వర్లు, సయ్యద్, నాగభూషణం, ఎర్రగడ్డ ప్రసాద్, కోటేశ్వరరావు, వేణు, నాగ శ్రీనివాస్, పివి.నారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ చట్టాలపై అవగాహన


గణపతిని సన్మానిస్తున్న జీఎం శాలెంరాజు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని జీఎం కార్యాలయంలో గురువారం పర్యావరణ అనుమతులు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జీఎం ఎన్విరాన్‌మెంట్ జేవీఎల్ గణపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తాను ఎన్విరాన్‌మెంట్ జీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సుమారు 15 గనులకు అనుమతులు రాబట్టేందుకు ప్రయత్నించి సక్సెస్ అయ్యానన్నారు. కిష్టారం, మణుగూరు, పీకే, ఆర్జీ ఓసీల విస్తరణకు ఈసీ అనుమతి పొందడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందనున్న గణపతిని ఏరియా జీఎం శాలెంరాజు సన్మానించారు.

ట్రైకార్ చైర్మన్‌కు వినతి


బెల్లయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రాందాస్

జూలూరుపాడు: ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్‌ను గురువారం హైదరాబాద్‌లో బేతాళపాడు మాజీ సర్పంచ్ గుగులోత్ రాందాస్ కలిసి వినతిపత్రం అందజేశారు. 2020 – 2021లో లాటరీ పద్ధతిలో ట్రైకార్ లబ్దిదారుల ఎంపిక జరిగిందని, వారు బ్యాంకుల్లో డిపాజిట్ చేసినప్పటికీ ఇప్పటి వరకు సబ్సిడీ పడకపోవడంతో యూనిట్ల పంపిణీ జరగలేదని, ఈ సమస్యను పరిష్కరించాలని ట్రైకార్ చైర్మన్‌ను కోరినట్లు మాజీ సర్పంచ్ రాందాస్ స్థానిక విలేకరులకు తెలిపారు. అదేవిధంగా ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు.

సీఎం హామీలను అమలు చేయాలి


మాట్లాడుతున్న నరాటి ప్రసాద్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న వంట కార్మికులకు సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ కోరారు. శేషగిరిభవన్‌లో గురువారం జరిగిన మిడ్ డే మీల్స్ వర్కర్స్ జిల్లా కమిటీ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్యతో కలిసి మాట్లాడారు. సొంత పెట్టుబడితో విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకుంటూ పౌష్టికాహారం అందిస్తున్నా.. సంబంధిత బిల్లులను ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు. కులాల పేరుతో విద్యార్థులకు మెనూ చార్జీల బిల్లులు మంజూరు చేయడం దురదృష్టకరమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అడుగుజాడల్లోనే నూతన కాంగ్రెస్ ప్రభుత్వ నడుస్తోందని ఆరోపించారు. నూతన బడ్జెట్‌లో మెనూ చార్జీలు పెంచి పెరిగిన ధరలకు అనుగుణంగా ఒక విద్యార్థికి రూ.20 అందించి మంచి ఆహారం అందించే విధంగా పాలకులు ఆలోచన చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వంట కార్మికుల బిల్లులు, వేతనం మంజూరు చేసి అప్పుల ఊబి నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దాసుల పుష్పవతి, సత్తెనపల్లి విజయలక్ష్మి, ప్రభావతి, మంగ, క్రాంతి, పద్మ, రమాదేవి పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలను మండల నాయకులు జూలూరుపాడులో గురువారం ఘనంగా నిర్వహించారు. లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్ కేక్ కట్ చేశారు. ప్రభుత్వాస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు.

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఆవరణలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.

పాఠశాలకు వితరణ

టేకులపల్లి: ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం ఉండాలని బొమ్మనపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మంగీలాల్ అన్నారు. గురువారం కొత్తగూడేనికి చెందిన ఆర్కే ట్రేడర్స్ అధినేత హన్స్‌రాజ్ జకోటియా గ్యాస్ స్టవ్, సిలిండర్, మినీ మినరల్ వాటర్ సెట్‌ను పాఠశాలకు వితరణగా అందజేశారు.

గొడుగులు, రెయిన్ కోట్లు..

పాల్వంచ: పేద కార్మికులకు పాండురంగాపురం గ్రామానికి చెందిన పోతురాజు రాము వితరణ అందించారు. గురువారం నాలుగు పంచాయతీల్లోని కార్మికులకు గొడుగులు, రెయిన్ కోట్లు ఉచితంగా అందించారు. అదే విధంగా పాండురంగాపురం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు గొడుగులు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, పరీక్ష ప్యాడ్లు వితరణగా అందించాడు. జక్కుల సురేష్, రాజశేఖర్, చిన్న వెంకటరామయ్య, రమేష్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

జూలూరుపాడు: మండలంలోని బేతాళపాడు గ్రామ పంచాయతీ రాచబండ్లకోయగూడెం గ్రామానికి చెందిన తాటి పాపమ్మ పత్తి పంటను తొలగించిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య కథనం ప్రకారం.. రాచబండ్లకోయగూడేనికి చెందిన పాపమ్మ పత్తి చేలోకి అదే గ్రామానికి చెందిన ఈసం ఎర్రయ్య అక్రమంగా ప్రవేశించి, తనకు వాటా ఉందంటూ పత్తి మొక్కలను పీకేశాడు. సుమారు రూ. 25 వేలు నష్టం కలిగించాడని బాధితురాలు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

జెన్‌కోనే థర్మల్ ప్లాంట్ నిర్మించాలి


సీఎండీ రోనాల్డ్ రోజ్‌ను కలిసిన నాయకులు

పాల్వంచ: రామగుండంలో నూతనంగా నిర్మించబోయే థర్మల్ ప్లాంట్‌ను సింగరేణి కాకుండా జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎంఏ వజీర్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఎండీ రోనాల్డ్ రోజ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వజీర్ మాట్లాడుతూ... ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చాలని, ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్ఈబీ రూల్స్ అమలుచేసి గ్రేడ్‌లుగా మార్చాలన్నారు. కారుణ్యనియామకాలను అందరికీ ఇవ్వాలని కోరారు. కేటీపీఎస్ నుంచి వైటీపీఎస్‌కు బదిలీ అయిన వారిని కేటీపీఎస్ 5,6,7 దశలకు, ట్రైనింగ్ సెంటర్‌కు బదిలీ చేయాలని కోరారు. సీఎండీని కలిసిన వారిలో రాధాకృష్ణ, వెలదండి ప్రసాద్, దానం నర్సింహారావు, ఎం.నర్సిరెడ్డి, జి.కుమారస్వామి, ఫి.ధనయ్య, అబ్దుల్‌తకీ, నగేశ్, శ్రీను, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

29న ఏఐటీయూసీ మహాసభ

జూలూరుపాడు: 29న జూలూరుపాడులో జరిగే ఏఐటీయూసీ 6వ మండల మహాసభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. గురువారం జూలూరుపాడులో మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగంలో పనిచేసున్న కార్మికుల చట్టాలను మార్పులు చేసి కార్మికులకు రక్షణ లేకుండా చేస్తుందని విమర్శించారు. ఏఐటీయూసీ మండల మహాసభను విజయవంతం చేసేందుకు కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యల్లంకి మధుసూదన్‌రావు, మాచర్ల శ్రీను, భూక్యా శ్రీనివాస్, గార్లపాటి వీరభద్రం, వల్లమల సామేలు, మల్కం వీరభద్రం, ఎస్కే బుడేన్ పాషా, నేలాల నవీన్, సాయిరామ్, సాయి పాల్గొన్నారు.

పార్క్ అభివృద్ధి పనుల పరిశీలన


పార్క్‌లో పనులను పరిశీలిస్తున్న చైర్మన్ డీవీ, కమిషనర్ యాదగిరి

ఇల్లెందు: పట్టణంలోని కొత్త కాలనీలో నిర్మాణంలో ఉన్న పార్క్ పనులను గురువారం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ యాదగిరి సందర్శించి పరిశీలించారు. మాట్లాడుతూ... పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలు ఉపయోగించుకునేలా చూడాలని కోరారు. పిల్లలకు ఆట వస్తువులు, పెద్దలకు చక్కటి వాతావరణం, పూలమొక్కలు, సెల్ఫీ స్పాట్, వాటర్ ఫౌంటెన్ ఈ పార్క్‌లో ఉండబోతున్నాయని తెలిపారు. మేనేజర్ అంకుషావలీ, డీఈ నవీన్, కౌన్సిలర్ కడకంచి పద్మ, ఏఈ కుమారస్వామి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అతహర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం..

సుజాతనగర్: దళిత గ్రామాల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాలని మాదిగల ఐక్యవేదిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సమష్టిగా ఉద్యమించాలనే నిర్ణయంలో భాగంగా గురువారం సుజాతనగర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. నాయకులు మాట్లాడుతూ... మాదిగ, బుడగ జంగాల గ్రామాల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని, దళిత గ్రామాల అభ్యున్నతికి కృషితో పాటు అంబేద్కర్ ఆశయాలు సాధించేందుకు గ్రామాల్లో చైతన్య సమావేశాలు నిర్వహిస్తామన్నారు. దళిత జాతి విచ్ఛిన్నం కోసం ఆధిపత్యదారుల ఆగడాలను తిప్పికొట్టాలని సూచించారు.

కార్యక్రమంలో కత్తి వెంకన్న, కాకటి బాబు, మురిపిటి నాగేష్, కనుకుంట్ల నిర్మల, మురిపిటి రాములు, మంద రాజు, కత్తి బాలకృష్ణ, గుండేటి వెంకట రాములు, సిరిగిరి మురళి, వేల్పుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై డీసీసీబీ చైర్మన్ ఆరా


డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న కొత్వాల తదితరులు

పాల్వంచ/జూలూరుపాడు/చుంచుపల్లి: పాల్వంచలోని డీసీసీబీ బ్రాంచ్‌ను డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ద్వారా రుణాలు తీసుకున్న రైతులకు సంబంధించి మాఫీపై ఆరా తీశారు. ఆయనను డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, డైరెక్టర్లు సన్మానించారు. బ్యాంక్ మేనేజర్ ఎ.స్వప్న, సూపర్‌వైజర్ వి.సురేష్, డైరెక్టర్లు బుడగం రాంమోహన్‌రావు, కనగాల నారాయణరావు, చౌగాని పాపారావు, యర్రంశెట్టి మధుసూదన్‌రావు, సీఈఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అలాగే, డీసీసీబీ చైర్మన్ జూలూరుపాడు సొసైటీని సందర్భంగా రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని చైర్మన్ చీమలపాటి భిక్షం, డైరెక్టర్లు వినతిపత్రం అందజేశారు. చైర్మన్, డైరెక్టర్లు యల్లంకి సత్యనారాయణ, చాపలమడుగు రామ్మూర్తి, లకావత్ హేమ్లా మాట్లాడుతూ... పీఏసీఎస్ పరిధిలో 3,964 మంది రైతులకుగాను 773 మందికే రుణమాఫీ అయినందున మిగిలిన వారికీ అమలు చేయాలని, పహాణీ నకలుపై రుణం తీసుకున్న 862 మంది రైతులకు కూడా వర్తింపజేయాలని కోరారు. బ్రాంచ్ మేనేజర్ మానస, ఉద్యోగులు శ్వేత, నరేష్, తేజ, ఎస్వీ రమణారెడ్డి, నరేందర్ పాల్గొన్నారు. కాగా, డీసీసీబీ చైర్మన్ కొత్తగూడెం బ్రాంచ్‌కు వచ్చిన సందర్భంగా సొసైటీ చైర్మన్ మండే వీర హన్మంతరావు కలిసి ప్రతీ రైతుకు రుణమాఫీ అయ్యేలా చూడాలని కోరారు. డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ శాంతి రాగమయి, సూపర్‌వైజర్ విక్రమ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారి సందర్శన

పాల్వంచ మండలంలో జిల్లా వ్యవసాయ అధికారి వి.బాబూరావు పర్యటించి పంట రుణమాఫీపై ఆరా తీశారు. శ్రీనివాస కాలనీ, పేటచెరువు ఏరియాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించారు. డీసీసీబీ బ్యాంక్‌ను సందర్శించారు. అనంతరం లక్ష్మీగణపతి ఎరువుల షాపును తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి శంభోశంకర్, ఏడీఏ జి.లాల్‌చంద్, ఎంఈఓ విజయభాను పాల్గొన్నారు.

పేరుకే విలేజ్ బస్ ఆఫీసర్లు!

- గతేడాది ఆర్టీసీ డిపోల్లో నియామకం
- ఆర్టీసీని ప్రజలకు చేరువ కోసం వ్యవస్థ
- మహాలక్ష్మి పథకం అమలుతో కనుమరుగు



కొత్తగూడెం బస్టాండ్‌లో ప్రయాణికులు

చుంచుపల్లి: ఆర్టీసీ సంస్థ ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించేలా ఎప్పటికప్పుడు సరికొత్త మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగానే డిపోల పరిధిలో గతేడాది జూన్‌లో ఆర్టీసీ అన్ని డిపోల పరిధిలో విలేజ్ బస్ ఆఫీసర్లను నియమించిన విషయం తెలిసిందే. ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది పలువురికి ఈ విలేజ్ బస్ ఆఫీసర్లుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్టీసీ డిపోల పరిధిలో చురుగ్గా ఉన్న కొంతమందిని ఎంపిక చేయగా వారు తమకు కేటాయించిన గ్రామాల్లో ఆర్టీసీ సేవలను వివరిస్తూ, ప్రయాణికులు సంస్థను ఆదరించేలా కృషి చేయాల్సి ఉంది. కొత్తగూడెం డిపో పరిధిలో 22 మంది సిబ్బందిని ఇందుకోసం నియమించారు. వారికి శిక్షణ ఇచ్చి, టీషర్టులు, బ్యాగులు, గుర్తింపు కార్డులు సైతం అందజేశారు. అయితే ఆర్టీసీ ఈ వ్యవస్థ ఆశించిన స్థాయిలో పనిచేయకపోవడంతో ప్రస్తుతం పేరుకే అన్న చందంగా విలేజ్ బస్ ఆఫీసర్లు కొనసాగుతున్నారు. ఇక కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ –9 నుంచి మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి తేవడంతో ఈ విలేజ్ బస్ ఆఫీసర్ల వ్యవస్థ నిర్వీర్యంగా మారింది.

గ్రామానికి ఒకరు చొప్పున నియామకం..

అప్పట్లో పెద్ద గ్రామానికైతే ఒకరు చొప్పున, చిన్న గ్రామాలైతే రెండు, మూడింటికి కలిపి ఒక విలేజ్ బస్ ఆఫీసర్‌ను నియమించారు. వీరు ఆర్టీసీ ద్వారా అందించే పలు రకాలైన సేవలను గ్రామాల్లో ప్రజలకు వివరించడమే కాక సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీని ఆదరించాలని అవగాహన కల్పిస్తారు. దివ్యాంగులు, వృద్ధులు, విద్యార్థులకు అందించే రాయితీ పథకాలు, బస్సు పాస్‌ల వివరాలు వెల్లడిస్తారు. అంతేకాక గ్రామస్తుల నుంచి అందే వినతులు, ఫిర్యాదులు, సర్వీస్ అవసరమైన రూట్లను గుర్తించి ఆర్టీసీ అధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రజలతో సమావేశమై బస్సుల రాకపోకల సమయం, నూతన సర్వీస్‌లు, సమస్యల వివరాలు తెలుసుకుని అధికారులకు చెప్పాల్సి ఉంటుంది. అలాగే గ్రామాల్లో పెళ్లిళ్లు, శుభకార్యాలు, జాతరల వివరాలను సేకరించి రద్దీకి అనుగుణంగా బస్సు ట్రిప్పులు పెంచేలా చూడాలి. శుభకార్యాలు జరిగే వారి ఇళ్లకు వెళ్లి ఆర్టీసీ బస్సు అద్దెకు తీసుకుంటే రాయితీలను వివరించాలి. ఈ క్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, సంఘాల నాయకులు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులను సంప్రదిస్తారు. అయితే గతేడాది జూన్ వరకు ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఆర్టీసీ విలేజ్ బస్ ఆఫీసర్ల వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి వచ్చిందని అధికారులు పేర్కొంటున్నారు. అప్పుడు బస్సుల సంఖ్యకు తగ్గట్టు ప్రయాణికుల ఆదరణ లేకపోవడంతో వీరిని నియమించి ఆదాయాన్ని పెంచుకోవాలని సంస్థ ఆలోచన చేసింది. ఇక మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమల్లోకి వచ్చిన తరువాత ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడంతో ఈ విలేజ్ బస్ ఆఫీసర్ల అవసరం లేకుండా పోయింది.

వ్యవస్థ పనిచేయడం లేదు..



ఆర్టీసీలో విలేజ్ బస్ ఆఫీసర్ల వ్యవస్థ ఉంది. కానీ చురుగ్గా పనిచేయడం లేదు. వాలంటీర్‌గా పనిచేసే ఈ వ్యవస్థ మహాలక్ష్మి పథకం తర్వాత ప్రయాణికుల సంఖ్య అమాంతం పెరిగి, బస్సుల సంఖ్య తగ్గింది. అన్ని ప్రాంతాల్లో ఓఆర్ శాతం 100 దాటుతుంది. దీంతో విలేజ్ బస్సు ఆఫీసర్లు వివాహాది శుభకార్యాలు తదితర వాటికి సంబంధించి బస్సులను మాత్రమే బుక్ చేస్తున్నారు.
– బి.వెంకటేశ్వరరావు, డిపో మేనేజర్ కొత్తగూడెం

ఏరియాలో వన మహోత్సవం


మొక్కలు నాటుతున్న జీఎం జాన్‌ఆనంద్, మున్సిపల్ చైర్మన్ డీవీ, తదితరులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో గురువారం వృక్షోరోపన్–2024 కార్యక్రమంలో భాగంగా వన మహోత్సవం నిర్వహించారు. ఏరియా జీఎం జాన్ ఆనంద్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎఫ్‌డీఓ వెంకన్న, డీఎస్పీ చంద్రభాను, మున్సిపల్ కమిషనర్ యాదగిరి ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. సింగరేణి జీఎం మాట్లాడుతూ... బొగ్గు రంగం ప్రతీ ఏడాది ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచుతుందన్నారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణ కోసం తమ ప్రాంతంలో విరివిగా మొక్కలు నాటుతుందని, మైనింగ్ ప్రాంతంలో ప్రజల జీవనం మెరుగుపర్చేందుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం తవ్విన భూమి, ఓవర్ బర్డెన్ డంప్‌ల మీద పర్యావరణ పునరుద్ధరణ, గనులలో, చుట్టుపక్కల ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్, వృక్ష, జంతుజాలం పునరుద్ధరణ వంటి కార్యకలాపాల ద్వారా మైనింగ్ ప్రాంతాల్లో చుట్టుక్కల పచ్చదనం మెరుగు పర్చటం జరుగుతుందన్నారు.

సింగరేణి సంస్థ ఇప్పటి వరకు 7 కోట్ల మొక్కలు నాటి సంరక్షిస్తుందని తెలిపారు. అనంతరం పాఠశాలల విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం మల్లారపు మల్లయ్య, ప్రాజెక్టు ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, పర్యావరణ అధికారి ధనుంజయరెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు జే.వెంకటేశ్వర్లు, అధికారులు కిషన్, వెంకటేశ్వర్లు, అంజిరెడ్డి, శివకుమార్, సుధాకర్, సాయిస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.